సాక్షి అనకాపల్లి

బుధవారం । 29 । మే । 2024



అప్పన్నకు ఆర్జితసేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి.



ఘనంగా అమ్మవార్ల పండగ

గాజువాక సమీప నాతయ్యపాలెంలో కొలువైన బంగారుమాంబ, నూకాంబిక, దుర్గాలమ్మ పండగ వైభవంగా నిర్వహించారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 38.0/29.0

వాతావరణం పొడిగా ఉంటుందని, గరిష్ట ఉష్ణోగ్రతలు 2-4 డిగ్రీలు క్రమంగా పెరిగే అవకాశముందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం తెలిపారు.

న్యూస్‌రీల్

ఎం. కోడూరులో టాస్క్‌ఫోర్స్ కమిటీ తనిఖీ

- మహిళా శిశు సంక్షేమ పథకాల రికార్డుల పరిశీలన



రికార్డులు తనిఖీ నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు

మాడుగుల రూరల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మహిళా, శిశు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ తీరుపై జిల్లా టాస్క్‌ఫోర్సు కమిటీ ప్రత్యేక తనిఖీ చేపట్టింది. టాస్క్‌ఫోర్సు కమిటీ సభ్యులుగా డీపీవో జగదీష్, ఎస్‌వో రామచంద్రరావు, జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సు నాగవేణి, జనార్దన్ బృందంగా ఏర్పడి మంగళవారం కె.జె.పురం పీహెచ్‌సీ పరిధి ఎం. కోడూరు సచివాలయంలో తనిఖీలు చేసింది. ఇక్కడ మూడేళ్లపాటు వైద్య ఆరోగ్య సేవలు, గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు అందిస్తున్న వ్యాధి నిరోధక టీకాలు, ఎంసీహెచ్ కార్డులు ఆన్‌లైన్ విధానం, కిశోర బాలికలకు అందిస్తున్న సేవలకు సంబంధించి రికార్డులు పరిశీలించింది. గర్భిణులకు రక్త పరీక్షలు, కిశోర బాలికలకు హెచ్‌ఐవీ పరీక్షలు చేయించింది. కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యాధికారులు ప్రసాదు పాత్రుడు, లీలాప్రసాదు, సీహెచ్‌వో పుష్పమ్మ, ఆరోగ్య పర్యవేక్షకుడు వెంకట్రావు, ఆరోగ్య సహాయకులు నీలాంబరం, ఏఎన్ఎం సావిత్రి, ఎంఎల్‌హెచ్‌పీ హేమ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్పన్నకు రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం

28 రోజులకు రూ. 2.60 కోట్లు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం లభించింది. సింహగిరిపై యాత్రికసదన్‌లో మంగళవారం స్వామివారి హుండీల ఆదాయం లెక్కించారు. 28 రోజులకుగానూ రూ.2,60,71,617 వచ్చినట్టు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. సగటున రోజుకు రూ.9,31,129 వచ్చినట్టు పేర్కొన్నారు. నగదుతో పాటు 116.200 గ్రాముల బంగారం, 20.540 కిలోల వెండి లభించినట్టు తెలిపారు. లెక్కింపులో దేవస్థానం అధికారులు, ఉద్యోగులు, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు. ఇంకా హుండీలు మిగిలిపోవడంతో బుధవారం కూడా ఆదాయాన్ని లెక్కించనున్నారు.

2న నూకాంబిక ఉత్సవమూర్తికి ప్రత్యేక గాజుల అలంకరణ



అనకాపల్లి: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు గవరపాలెం శ్రీ నూకాంబిక అమ్మవారి దేవాలయంలో జూన్ 2న రేవతి నక్షత్రంతో కూడిన ఏకాదశి రోజున అమ్మవారి బాలాలయంలో గాజుల అలంకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో బండారు ప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అమ్మవారి ఉత్సవమూర్తి అలంకరణ నిమిత్తం గాజులు ఇచ్చిన భక్తులు ఆలయంలో రశీదు తీసుకోవలసిందిగా ఆయన కోరారు.

అప్పన్న సన్నిధిలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న నీరభ్‌కుమార్ ప్రసాద్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరభ్‌కుమార్ ప్రసాద్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని ఈవో శ్రీనివాసమూర్తి అందజేశారు.

మనోహరం

- జిల్లా కేంద్రంలో డివైడర్ మధ్యలో పూలమొక్కలు
- కనువిందు చేస్తున్న రంగురంగుల పువ్వులు
- అనకాపల్లి బ్యూటిఫికేషన్‌పై జీవీఎంసీ ప్రత్యేక శ్రద్ధ





అనకాపల్లి మెయిన్‌రోడ్డులో డివైడర్ మధ్యలో మొక్కలు



రింగ్‌రోడ్డు డివైడర్ పనులు చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

అనకాపల్లి: పచ్చని మొక్కలు.. రంగురంగుల పువ్వులు.. రోడ్డుపై వెళుతుంటే చక్కని దృశ్యమాలికలు.. పర్యావరణహితంగా జీవీఎంసీ ప్రత్యేక చర్యలు.. ఇవీ అనకాపల్లిలో అందాలు కనువిందు చేస్తున్న వైనాలు. ఈ పట్టణం జిల్లా కేంద్రమే కాక మహా విశాఖ పరిధిలో ఉండడంతో బ్యూటిఫికేషన్‌పై శ్రద్ధ పెట్టారు. మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు పర్యావరణహితంగా డివైడర్ మధ్యలో మొక్కలు పెంచుతున్నారు. పూలు వికసించి ప్రజలను ఆహ్లాదపరుస్తున్నాయి. జాతీయ రహదారి జలగల మదుం జంక్షన్ నుంచి సుంకరమెట్ట జంక్షన్ మీదుగా నెహ్రూచౌక్, శారదానది బ్రిడ్జి వరకు, పూడిమడక జాతీయ రహదారి నుంచి గాంధీనగరం జంక్షన్, రైల్వేస్టేషన్ నుంచి రింగ్‌రోడ్డు, ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ మీదుగా మళ్లబ్రదర్స్ (ఒన్‌వే ట్రాఫిక్ డౌన్) రహదారి డివైడర్లను కొత్తగా ఏర్పాటు చేసి మధ్యలో పర్యావరణాన్ని కాపాడేందుకు, స్వచ్ఛమైన ఆక్సిజన్ ఇచ్చే విధంగా మొక్కలను నాటారు. మూడు మాసాల క్రితం డివైడర్ మధ్యలో మొక్కలు నాటేందుకు జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు, జీవీఎంసీ హార్టికల్చర్ అధికారుల ప్రత్యేక చొరవతో రూ.25 లక్షలు విడుదల చేశారు. బోగన్‌విలియా, మిర్చి మేరీగ్రీన్ వంటి మొక్కలను నాటారు.

గ్రిల్స్ ఏర్పాటుకు మొదటి దశలో రూ.45 లక్షలు విడుదల

డివైడర్ల మధ్యలో నాటిన మొక్కల చుట్టూ మూడు నుంచి నాలుగు అడుగుల గ్రిల్స్ నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. మొదటి దశలో రైల్వే స్టేషన్ జంక్షన్ నుంచి రింగ్ రోడ్డు, ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ నుంచి ఒన్‌వే ట్రాఫిక్ రహదారి వరకు 1.5 కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసేందుకు మార్కింగ్ చేసి పనులు ప్రారంభించారు.

గ్రిల్స్‌కు రంగులు వేయడంతో చూడముచ్చటగా ఉన్నాయి. రెండు నెలల్లో ఈ పనులు పూర్తవుతాయి. మొదటి దశ పనులు పూర్తయిన వెంటనే రెండో దశలో జాతీయ రహదారి జలగల మదుం జంక్షన్, సుంకరమెట్ట జంక్షన్, నెహ్రూచౌక్, శారదా బ్రిడ్జి వరకు సుమారు 6 కిలోమీటర్ల మేర గ్రిల్స్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్టు జోనల్ కమిషనర్ ఒ.అయ్యప్పనాయుడు చెప్పారు. రహదారులపై కొత్తందాలను చూసి పట్టణ ప్రజలు మురిసిపోతున్నారు.

కేజీహెచ్‌కు కార్ వితరణ



డాక్టర్ మురళీకృష్ణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డాక్టర్ అశోక్‌కుమార్

విశాఖ సిటీ: కేజీహెచ్‌లో వృద్ధులు, ఇతర రోగుల సౌకర్యార్థం ఎంవీపీ కాలనీలోని మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ బ్యాటరీతో నడిచే 8 సీటర్ కార్‌ను వితరణగా అందజేసింది. వేగవంతంగా రోగ నిర్ధారణకు, పోస్టు గ్రాడ్యుయేట్లకు మెరుగైన బోధన కోసం ఈఎన్‌టీ విభాగానికి రెండు ఎండోస్కోప్ యంత్రాలు ఇచ్చింది. వీటిని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్, ప్రభుత్వ ఈఎన్‌టీ ఆస్పత్రి హెచ్‌వోడీ ప్రొఫెసర్ హరికృష్ణలకు మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి ఎండీ వి.మురళీకృష్ణ అందజేశారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా రూ.10 లక్షలతో వీటిని అందజేసినట్లు డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. కారుతో పాటు డ్రైవర్‌ను కూడా ఏర్పాటు చేయడం పట్ల కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్ మహాత్మాగాంధీ ఆస్పత్రి ఎండీకి కృతజ్ఞతలు తెలిపారు. అత్యాధునిక వైద్య సదుపాయాలతో పాటు రోగుల సంక్షేమానికి క్యాన్సర్ ఆస్పత్రి యాజమాన్యం కృషి చేస్తోందని కొనియాడారు.

కార్డన్ సెర్చ్‌లో 50 వాహనాల స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మోహన్



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

మాకవరపాలెం: పోలీసులు నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లో సరైన పత్రాల్లేని 50 వాహనాలను సీజ్ చేశారు. మాకవరపాలెం మండల కేంద్రంలో మంగళవారం ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు పోలీసులు కార్డన్ సెర్చ్ చేపట్టారు. ఈ సందర్భంగా 49 మోటార్ సైకిళ్లు, ఒక అనుమానిత కారును స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. నర్సీపట్నం డీఎస్పీ మోహన్ కార్డన్ సెర్చ్ వివరాలు మీడియాకు వెల్లడించారు. సీజ్ చేసిన వాహనాలకు సంబంధిత యజమానులు సరైన పత్రాలతో స్టేషన్‌కు వచ్చి చూపిస్తే, వాహనాలను అందిస్తామన్నారు. రికార్డులు లేని వాహన యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ప్రాంతంలో గంజాయి రవాణాతోపాటు సారా తయారీపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ ముగిసే వరకు రాజకీయ నాయకులు ఎలాంటి సభలు, సమావేశాలు, కౌంటింగ్ రోజున విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదన్నారు. కార్యక్రమంలో నర్సీపట్నం రూరల్, టౌన్ సీఐలు హరి, క్రాంతి కుమార్, నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఎస్ఐలు రామకృష్ణారావు, రామారావు, ఉపేంద్ర, కృష్ణారావు పాల్గొన్నారు.

కన్నవారే కడతేర్చారు!

ఏదైనా వ్యాపారం చేసుకోవాలని పెద్ద కుమారుడికి తండ్రి రూ.6 లక్షలు ఇచ్చాడు. ఈ మొత్తంతో ఏర్పాటు చేసిన రెస్టారెంట్ నష్టాల్లోకి రావడంతో మరింత డబ్బు కావాలని కొడుకు వేధించాడు. ఆపై ఆస్తి పంపకాలు చేయాలని ఒత్తిడి తెచ్చాడు. ఈ బాధ భరించలేక కన్న తండ్రే చిన్న కుమారుడితో కలిసి హత్యకు పన్నాగం పన్నాడు. రూ.8 లక్షలు సుపారీ ఇచ్చి హత్య చేయించారు. ఆపై పోలీసులకు లొంగిపోయారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ, చిత్రంలో డీఎస్పీ అప్పలరాజు, అనకాపల్లి టౌన్ సీఐ శంకరరావు

- కొక్కిరాపల్లి హత్య కేసులో లొంగిపోయిన సోదరుడు, తండ్రి
- ఆస్తి పంచాలని వేధింపులు భరించలేక ఘాతుకం
- రూ.8 లక్షల సుపారీ ఇచ్చి దారుణం
- హత్య కేసులో ఏడుగురు నిందితులకు రిమాండ్
- కారు, 23 గ్రాముల బంగారం, 6 ఫోన్లు, కత్తి, రూ.77 వేలు స్వాధీనం
- మీడియాకు వెల్లడించిన ఎస్పీ మురళీకృష్ణ

సాక్షి, అనకాపల్లి: వి.మాడుగుల మండలం ఎం.కోటపాడుకు చెందిన శానాపతి రామాంజనేయులు(31) హత్య కేసులో పోలీసులు ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి మారుతీ స్విఫ్ట్ కారు, 23 గ్రాముల బంగారం, ఆరు మొబైల్ ఫోన్లు, నేరానికి ఉపయోగించిన కత్తి, రెండు టవళ్లు, నిందితుల నుంచి రూ.77,250 స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి వివరాలను మంగళవారం ఎస్పీ మురళీకృష్ణ మీడియాకు వెల్లడించారు. ఎం.కోటపాడుకు చెందిన శానాపతి నాగరాజు, లక్ష్మి దంపతులకు పెద్ద కుమారుడు రామాంజనేయులు(మృతుడు) తన తండ్రి ఇచ్చిన రూ.6 లక్షలతో స్వగ్రామంలో రెస్టారెంట్ ఏర్పాటు చేశాడు. ఇది నష్టాల్లోకి రావడంతో తనకు మరింత డబ్బులు ఇవ్వాలని, ఆస్తులు పంచాలని తల్లిదండ్రులు, సోదరుడితో వివాదం పెట్టుకున్నాడు. ఆ వివాదం పెద్దదై ఆస్తుల పంచడానికి వీలులేదన్న తల్లిదండ్రులను కొట్టడంతోపాటు హింసించేవాడు. దీంతో విసిగిపోయిన వారు హత్యకు పథకం వేశారు.

పూటుగా మద్యం తాగించి కారులో హత్య

ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తున్న మృతుని సోదరుడు శివాజీ తన సహోద్యోగి శీలంనేని గోపి (ఏ3)ని సంప్రదించాడు. ఆ మేరకు ఏ3 నిందితుడు గోపి స్నేహితులైన ఏ4-మేడం అంజిరెడ్డి, ఏ5-అందె నాగేంద్రబాబు, ఏ6-ఉప్పుతోట్ల మురళీకృష్ణ, ఏ7-మక్కన శివలతో హత్య చేయడానికి రూ.8 లక్షల సుపారీ మాట్లాడుకున్నారు. 21న మధ్యాహ్నం 2 గంటలకు నిందితులు అక్కడ రెస్టారెంట్‌కి వెళ్లి రామాంజనేయులుకు పూటుగా మద్యం తాగించి.. ఇంటి వద్ద దింపుతామంటూ కారులో తీసుకెళ్లి మార్గమధ్యంలో కడుపులో కత్తితో పొడిచి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని యలమంచిలి మండలం కొక్కిరాపల్లి వద్ద చెరువులో పడేసి పరారయ్యారు. ఇందుకుగానూ మృతుని సోదరుడు నిందితులకు రూ.6 లక్షలు ఇచ్చాడు. ఈ నెల 21న మాడుగుల పోలీస్ స్టేషన్లో తన భర్త కనిపించడం లేదని మృతుని భార్య శ్రీదేవి ఫిర్యాదు చేసింది. కొక్కిరాపల్లి చెరువులో లభించిన మృతదేహాన్ని ఆమెకు చూపించగా తన భర్తదే అని గుర్తించింది. వైద్యాధికారి ఇచ్చిన పోస్టుమార్టం రిపోర్టు ప్రకారం హత్యగా ధ్రువీకరించారు.

నేరం అంగీకరించిన తండ్రి, సోదరుడు...

ఐదు ప్రత్యేక పోలీసు బృందాలతో దర్యాప్తు చేశారు. దర్యాప్తు లో భాగంగా మృతుని తండ్రి నాగరాజు, తమ్ముడు శివాజీ, వారికి సహకరించిన శీలంనేని గోపి సతీష్ వీఆర్వో సమక్షంలో మంగళవారం మాడుగుల పోలీ స్ స్టేషన్‌లో లొంగిపోయి హత్య చేసినట్లు అంగీకరించారు. వీరి ద్వారా హత్య చేసిన మిగిలిన నలుగురు నిందితులను చోడవరం టౌన్ బస్టాండ్ వద్ద అరెస్ట్ చేశారు. ఏడుగురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ వెల్లడించారు. దర్యాప్తులో పాలు పంచుకున్న అధికారులకు సిబ్బందికి ఎస్పీ అభినందనలు తెలియజేశారు. అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎస్.అప్పలరాజు, అనకాపల్లి టౌన్ సీఐ శంకరరావు పాల్గొన్నారు.

బడిలో పసందైన భోజనం



శిక్షణలో భాగంగా సిద్ధం చేసిన వంటకాలు



వంటల తయారీపై సూచనలిస్తున్న ట్రైనర్



శిక్షణకు హాజరైన వంట ఏజెన్సీలు, ట్రైనర్స్

- తాజ్ హోటల్ చెఫ్‌ల ఆధ్వర్యంలో వంటల తయారీపై శిక్షణ
- మండల స్థాయిలో ఏజెన్సీల వారికి వంటల పోటీలు
- 1,424 పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు
- పాఠశాలకు వచ్చే విద్యార్థులంతా భోజనం తినేలా ఏర్పాట్లు

సాక్షి, అనకాపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న గోరుముద్ద (మధ్యాహ్న భోజనం)ను విద్యార్థులకు మరింత రుచిగా అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. జూన్ 12న పాఠశాలలు తెరుస్తున్నందున విద్యార్థులకు నాణ్యమైన చదువులతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట వేసేలా ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా మధ్యాహ్న భోజనం వండే ఏజెన్సీల వారికి మరింత రుచిగా వంట ఎలా తయారు చేయాలనే దానిపై శిక్షణ ఇచ్చింది. మండల స్థాయిలో ఎంపిక చేసిన కొంత మందికి విజయవాడలోని తాజ్ హోటల్ చెఫ్‌ల ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వగా.. అక్కడ శిక్షణ పొందిన వారు మండల స్థాయిలో వంట ఏజెన్సీల వారికి మెలకువలు నేర్పించారు.

విద్యార్థులు మైమరిచి తినేలా వంటకం

జిల్లాలో 24 మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో వంట తయారీలో పాల్గొంటున్న 2,869 మంది కుక్ కమ్ హెల్పర్లను ఈ ప్రత్యేక శిక్షణలో భాగస్వాములను చేశారు. విద్యార్థులకు ప్రతి రోజూ రుచికరమైన వంటకాలు తయారు చేసి పెట్టేలా తర్ఫీదు ఇచ్చారు. ఇందులో భాగంగా నిర్వాహకులకు వంటల పోటీలు నిర్వహించి.. ఆహా అనిపించే వంటకం తయారు చేసిన వారికి బహుమతులు అందజేశారు.

విద్యార్థులంతా భోజనం తినేలా..

జిల్లాలో ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని 1424 పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తుండగా.. 1,07,598 మంది విద్యార్థులు దీని ద్వారా లబ్ధి పొందుతున్నారు. ఒకటి నుంచి 5వ తరగతి వరకు గల విద్యార్థులు 99 శాతం మేర బడిలోనే మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. కానీ అప్పర్ ప్రైమరీలో 81 శాతం, హైస్కూల్లో చదివే విద్యార్థులు 78 శాతం మంది భోజనం తింటున్నారు. ఈ లెక్కన కొంతమంది ఇంకా ఇళ్ల వద్ద నుంచే బాక్సులు తెచ్చుకుంటున్నారని ఉన్నతాధికారుల పరిశీలనలో తేలింది. దీనిపై దృష్టి సారించిన ప్రభుత్వం బడికి వచ్చే విద్యార్థులంతా కచ్చితంగా గోరుముద్ద పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా ఏర్పాట్లు చేశారు.

వంట నిర్వాహకులకు గుర్తింపు

విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారం అందించడంతో పాటు పాఠశాల ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచేలా విద్యాశాఖ ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా జిల్లాలో 1,586 మంది ఆయాలను నియమించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే ఆయాల నియామకం జరిగింది. వీరికి ఒక్కొక్కరికీ నెలకు రూ.6 వేల వేతనం చెల్లిస్తున్నారు. వంట నిర్వాహకులకు టీడీపీ హయంలో నెలకు రూ.1000లను మాత్రమే ఇచ్చారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వీరి గౌరవ వేతనం రూ.3 వేలకు పెంచింది.

ఇదీ మెనూ

సోమవారం	హాట్ పొంగల్, ఉడికించిన గుడ్డు/ పలావ్‌తో ఎగ్ కర్రీ, వేరుశనగ చిక్కీ
మంగళవారం	దొండకాయ చట్నీతో చింతపండు పులిహోర, ఉడికించిన గుడ్డు
బుధవారం	కూరగాయల అన్నం, బంగాళదుంప కుర్మా, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ
గురువారం	సాంబార్ బాత్ లేదా టమోటా చట్నీతో నిమ్మకాయ రైస్, ఉడికించిన గుడ్డు
శుక్రవారం	అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ
శనివారం	ఆకుకూర అన్నం, పప్పు చారు

ఖరీఫ్ పంటకు రైతులు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ జగన్నాథరావు

అనకాపల్లి: నైరుతి రుతుపవనాలు సరైన సమయానికి వచ్చే అవకాశం ఉన్నందున రైతులు ఖరీఫ్ పంటలైన వరి, మొక్కజొన్న, వేరుశనగ, సజ్జ, కొర్ర, రాగి ఇతర పంటలకు సంబంధించిన మేలైన రకాలను ఎంపిక చేసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ పి.వి.కె.జగన్నాథరావు అన్నారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్కడైనా ఇంకా పచ్చిరొట్ట పైరును విత్తుకోని రైతులు తేమను ఉపయోగించుకుని జనుము, జీలుగ, పిల్లిపెసర, అపరాలు పైరును వేసుకోవాలని ఆయన రైతులను కోరారు. ఖరీఫ్‌కు విత్తనాలను సమకూర్చుకుని సిద్ధంగా ఉండాలన్నారు. పరిశోధన స్థానంలో ఐపీఎం 2-14 అనే పెసర రకం కిలో రూ.130లుగాను, విజయనగరం నుంచి విడుదలైన అధిక పోషక విలువలున్న ఇంద్రావతి అనే రాగి/చోడి రకం కిలో రూ.70లు చొప్పున అందుబాటులో ఉన్నట్లు ఆయన తెలిపారు. వర్షాధారంగా జూన్‌లో వేసుకోవడానికి అనువైన 87ఏ298చ 2009ఎ107, 2009ఎ252 చెరకు రకాల విత్తనం అందుబాటులో ఉన్నాయని, పొలాన్ని రైతులు దుక్కులు దున్ని ఖరీఫ్ పంటలకు నేలను సిద్ధం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, డి.ఆదిలక్ష్మి, వి.గౌరి, ఎం.విశాలాక్షి, ఎ.శిరీష, వి.చంద్రశేఖర్, ఎ.అలివేణి పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెస్ క్రీడాకారులకు అభినందన

కశింకోట: మహారాష్ట్రలోని పూణేలో ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ చదరంగం పోటీలో ప్రతిభ కనబరచిన జిల్లాకు చెందిన క్రీడాకారుల్ని ప్రగతి చెస్ అకాడమీ అధ్యక్షులు దువ్వూరి సత్యగాయత్రీదేవి, కార్యదర్శి దువ్వూరి సుధీర్, అనకాపల్లి చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు, కోచ్ మల్లికార్జునరావు మంగళవారం అభినందించారు. జిల్లా చెస్ అసోసియేషన్ నుంచి పోటీకి హాజరైన భీశెట్టి శ్రావ్యశ్రీ(ఎస్.రాయవరం) 1800లోపు విభాగంలో 4వ స్థానం కైవసం చేసుకుందన్నారు. అనకాపల్లికి చెందిన కందలం తేజ 90 శాతం రేటింగ్ పెంచుకోగా, కందుల జయలక్ష్మి గట్టి పోటీ ఇచ్చారని పేర్కొన్నారు. భవిష్యత్ పోటీల్లో మరింతగా రాణించాలని అభిలషించారు.

అక్రమ లేఅవుట్లను అరికట్టాలి


వీఎంఆర్డీఏ కార్యాలయం వద్ద వినతి పత్రంతో రైతులు అప్పారావు, శ్రీనివాస రావు

బీచ్ రోడ్డు: వి.మాడుగుల మండలం సాగరం గ్రామం పంచాయతీ పరిధిలో అక్రమ లేఅవుట్లు జోరుగా సాగుతున్నాయని, వాటిని తక్షణమే అరికట్టాలని ఆ పంచాయతీ రైతులు ఎం.అప్పారావు, ఎస్.శ్రీనివాసరావు వీఎంఆర్డీఏ అధికారులను కోరారు. ఈ మేరకు సిరిపురంలోని వీఎంఆర్డీఏ కార్యాలయంలో అధికారులను కలిసి వినతి పత్రం అందజేశారు. వీఎంఆర్డీఏ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా సుమారు 14 ఎకరాల పంట పొలాల్లో అక్రమ లేఅవుట్లు వేసి విక్రయిస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. వాటిని తక్షణమే తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

30 లీటర్ల సారా స్వాధీనం

పాయకరావుపేట: మండలంలోని సత్యవరం గ్రామం వద్ద వాహన తనిఖీల్లో ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న 30 లీటర్ల సారాను మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ ఎస్.ధర్మారావు తెలిపారు. నక్కపల్లి మండలం గునుపూడి గ్రామానికి చెందిన పి.అప్పలకొండను అదుపులోకి తీసుకుని, ద్విచక్ర వాహనాన్ని, సారాని స్వాధీనం చేసుకున్నామన్నారు. అప్పలకొండపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

జిల్ జిల్ సోడా.. గోలీసోడా

- పాత గోలీ సోడాలకు కొత్త హంగులు
- అందుబాటులో వివిధ రకాల ఫ్లేవర్లు
- వేసవి ఎండలతో పెరిగిన గిరాకీ

గోలీసోడా.. ఆ పేరే ఓ ఎమోషన్. గోలీసోడా కొడుతుంటే వచ్చే సౌండ్ వినడం భలే మజా. ఎంత గట్టిగా సౌండ్ వస్తే.. అంత గొప్పగా సోడా ఉంటుందన్న నమ్మకం. పాత తరంలో పిల్లలు, పెద్దలు కూడా గోలీసోడాకు దాసులేనంటే అతిశయోక్తి కాదు. కార్పొరేట్ కూల్‌డ్రింక్స్ మార్కెట్లో రంగప్రవేశం చేశాక గోలీసోడా కనుమరుగయింది. ఇపుడు స్టార్టప్‌ల ద్వారా కార్పొరేట్ రంగులద్దుకుని కొత్త రూపుతో, రకరకాల ఫ్లేవర్లతో మళ్లీ మన ముందుకొచ్చి.. తెగ సౌండ్ చేస్తోంది.


యలమంచిలిలో విక్రయానికి సిద్ధంగా ఉంచిన కొత్తరకం గోలీసోడాలు


వేసవితాపం నుంచి సేద తీరేందుకు గోలీసోడా తాగుతున్న పిల్లలు

యలమంచిలి రూరల్: ఎనభయ్యో దశకం నుంచి సుమారు రెండు మూడు దశాబ్దాల పాటు గోలీసోడాకు ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. ఏ ప్రాంతానికెళ్లినా రోడ్డుపక్క దుకాణాల్లో సిమెంట్/మట్టి గోలెంలో చల్లని నీటిలో ఉంచి అమ్మకాలు జరిపేవారు. ఆర్డినరీ సోడా, నిమ్మ సోడా, కలర్ సోడా అంటూ చెక్క బండ్లపై విక్రయించేవారు. ముఖ్యంగా వేసవి వచ్చిందంటే చాలు.. వేసవి తాపం తీర్చడంలో గోలీసోడాయే కీలకం. ఒక్కసారిగా కనుమరుగైన గోలీసోడా ఇపుడు కొత్త రూపుతో మార్కెట్‌ను ముంచెత్తింది.

కూల్ డ్రింక్‌ల రాకతో కనుమరుగు

వివిధ రకాల కూల్ డ్రింక్‌లు మార్కెట్లోకి ప్రవేశించడంతో గోలీసోడా ప్రాబల్యం తగ్గింది. దీనికి తోడురోజుకో రకం సోడా మెషీన్లు రావడం, కార్పొరేట్ సంస్థలు కూడా ప్లాస్టిక్ బాటిళ్లలో సోడాలను తయారుచేసి విక్రయించడంతో గోలీసోడాలు కనుమరుగయ్యాయి. ఇపుడు అదే సోడా కొత్తదనాన్ని సంతరించుకుని మార్కెట్‌లోకి వచ్చింది. వివిధ రకాల ఫ్లేవర్లతో మారుతున్న కాలానికి, ప్రజల అభిరుచులకు అనుగుణంగా రంగులు, హంగులు అద్దుకుంది. రూపాంతరం చెందిన గోలీసోడా రకరకాల రుచుల్లో లభిస్తోంది. యలమంచిలి, అనకాపల్లి, అచ్యుతాపురం, చోడవరం, నర్సీపట్నం సహా మండల కేంద్రాలు, జనాభా ఎక్కువగా ఉండే మేజర్ పంచాయతీల్లో కొత్తరకం గోలీసోడాల అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి.

రం'గోలీ సోడా'

ప్రస్తుతం పాత వాటికి కొత్త రూపునిచ్చి, మార్కెట్లోకి వదలడం ట్రెండ్‌గా మారింది. పాత సినిమాల్లో హిట్ పాటల రీమేక్ మొదలు, అనేక గృహోపకరణాలు కూడా కొత్త సాంకేతికతను సంతరించుకుని మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. గోలీసోడాదీ అదే దారి. గతంలో గోలీసోడా రుచి తెలిసిన వారితోపాటు, యువతరం కూడా వీటిని ఇష్టపడుతోంది. లెమన్, ఆరెంజ్, గ్రేప్, పైనాపిల్, స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ తదితర ఫ్లేవర్లలో అన్ని వర్గాల వారినీ గోలీసోడా ఆకట్టుకుంటోంది. పూర్వం 10 పైసల నుంచి ప్రారంభమైన గోలీసోడా రూ.1 వరకూ అమ్మకాలు జరగగా.. ప్రస్తుతం మార్కెట్‌లో కొత్తగా వచ్చిన గోలీసోడా రూ.10 నుంచి రూ.50 వరకు అమ్ముడవుతోంది. గతానికంటే భిన్నంగా ఇప్పుడు ఫ్రిజ్‌లో పెట్టిన చిల్డ్ గోలీసోడా తాగుతూ యూత్ చిల్ అవుతోంది.

పాతదే అయినా కొత్తగా..



సోడా సీసా రూపు రేఖలు పాతవే అయినా కొత్తగా ఉంది. దీంతో అందరూ సోడా తాగేందుకు ఇష్టపడుతున్నారు. గాజువాక నుంచి రప్పించి ఇక్కడ విక్రయిస్తున్నా. నా దగ్గర రోజుకు 150 నుంచి 200 వరకు సోడాలు అమ్ముడవుతున్నాయి. వేసవిలో గిరాకీ ఉండడంతో సోడాల వ్యాపారం ఉపాధినిస్తోంది. గతంలో అన్నం తిన్న తర్వాత తప్పకుండా సోడా తాగేవారు. వెంటనే తేన్పు వచ్చేది. ఎటువంటి అనారోగ్యం లేని పానీయంగా గోలీసోడాకు పేరుంది.

– సత్తిబాబు, సోడా వ్యాపారి, యలమంచిలి

ఆ టేస్టే వేరు



గోలీ సోడా గతంలో ఎప్పుడో తాగాను. మళ్లీ కొత్తది ఇప్పుడు రుచి చూశా. అప్పటికీ, ఇప్పటికీ తేడా సోడాలో రంగులు, కాస్త ఆకర్షణీయంగా కనిపించడం. రుచి కూడా పాతకాలం సోడాల కంటే భిన్నంగా, కాస్త గొప్పగానే ఉంది. ఏదైనా పాతదానికి కొత్తదనాన్ని తీసుకురావడంతో గత అనుభూతుల్ని ఇప్పటి తరానికి గుర్తు చేసినట్టయింది. చాలా మంది రుచి చూసేందుకైనా తాగుతున్నారు. ఇప్పటి జనానికి రంగుల ప్రపంచం కావాలి. అందుకే వీటికి గిరాకీ ఉంటోంది.

– దూది నర్సింహమూర్తి, యలమంచిలి

ఆదరణ పెరిగింది



కొత్తగా వచ్చిన గోలీ సోడాకు ప్రజల నుంచి విశేష ఆదరణ దక్కుతోందనడంలో అతిశయోక్తి లేదు. వివిధ రకాల ఫ్లేవర్లలో లభిస్తున్న గోలీ సోడాలు రుచిగా కూడా ఉంటున్నాయి. ముఖ్యంగా ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో తాగితే దాహం తీరి, సేద తీరినట్టుంటోంది. హైజనిక్‌గా తయారుచేస్తుండటంతో కూల్‌డ్రింక్‌లకన్నా గోలీసోడా తాగేందుకు మొగ్గు చూపుతున్నాం. సోడా తాగాక దప్పిక నుంచి సంతృప్తి చెందిన ఫీలింగ్ లభిస్తోంది.

– రమేష్, బైక్ మెకానిక్, యలమంచిలి

వైఎస్సార్‌సీపీ విజయోత్సవానికి సిద్ధం కండి


పార్టీ నేతలతో మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్

- పార్టీ శ్రేణులకు ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌కుమార్ పిలుపు

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ శ్రేణులు విజయోత్సవాలకు సిద్ధంగా ఉండాలని ఎంపీ బీవీ సత్యవతి, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌లు పిలుపునిచ్చారు. విశాఖ కేంద్రంగా వచ్చే నెల 9న రెండోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రతి ఒక్కరూ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలతో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. మే 13న జరిగిన ఎన్నికల్లో ఓటర్లు సైలెంట్‌గా తమ ఓట్లు వేసి, మరో సారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించినట్లు తెలిపారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు జరిగాయన్నారు. జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు, ఫలితాల్లో కూడా పార్టీ నాయకులు, శ్రేణులు, అభిమానులు సంయమనం పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, అన్నపూర్ణ బ్యాంక్ చైర్మన్ పీడీ గాంధీ, తుమ్మపాల సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, కోడూరు సర్పంచ్ శ్రీను, 84వ వార్డు ఇన్‌ఛార్జి కోరుకొండ రాఘవ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య పరిరక్షణలో నిర్లక్ష్యం వద్దు


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ శచీదేవి

తుమ్మపాల: మహిళల ఆరోగ్యంపై నిర్లక్ష్యం చూపరాదని, ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఆర్డీఏ పీడీ కె.శచీదేవి అన్నారు. మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ యుక్తవయస్సులో బాలికలు తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎన్టీఆర్ వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ హిందూ మాట్లాడుతూ రుతుస్రావ సమయంలో ప్రతి మహిళ జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. రుతుక్రమ సామగ్రి ఉపయోగించే విధానంపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ చేశారు. అంతకుముందు విజ్ఞాన్ కళాశాల ఆర్థిక సహాయంతో సమకూర్చిన శానిటరీ పాడ్స్‌ను మహిళలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ డైజీ, డీఎల్‌డీవోలు మంజులావాణి, ఉదయశ్రీ, ప్రొఫెసర్ మనోజ్ఞ, డీఆర్డీఏ వీవోఏ, విద్యార్థులు పాల్గొన్నారు. రేబాక పంచాయతీ కాపుశెట్టివానిపాలెంలో ఐసీడీఎస్ సీడీపీవో శశికళ నిర్వహించిన కార్యక్రమంలో బాలికలు తీసుకోవల్సిన పౌష్టికాహారం, పరిశుభ్రత, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించి, ర్యాలీ చేశారు.

కనకమహాలక్ష్మి.. నమోస్తుతే

కనులపండువగా అమ్మవారి జాతర








బీచ్‌రోడ్డు: చిన్నవాల్తేరులో కొలువైన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవం మంగళవారం కనులపండువగా సాగింది. మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య అనుపు ఉత్సవం, అమ్మవారికి పంచామృతాభిషేకం జరిపించారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు నిర్వాహకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ప్రసాదం, మజ్జిగ పంపిణీ చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం క్యూలు, మంచి నీటి సదుపాయం కల్పించింది. అమ్మవారిని విశాఖ ఎంపీ, వైఎస్సార్ సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, ప్రసాదం స్వీకరించారు. వైఎస్సార్ సీపీ 21వ వార్డు అధ్యక్షుడు మదుపాక రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. జాతరలో ముస్లింలు భాగమయ్యారు. 'కులం.. మతం కాదు.. మనమంతా భారతీయులం.. అందరూ బాగుండాలి అందులో మనం ఉండాలి'అనే నినాదంతో మొహమ్మదియా మసీద్ యూత్ సభ్యులు భక్తులకు ప్రసాదం, జ్యూస్ పంపిణీ చేసి ఆదర్శంగా నిలిచారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య


గంగాధర్ (ఫైల్)

యలమంచిలి రూరల్: ప్రేమించిన యువతి తనతో మాట్లాడట్లేదని మనస్తాపానికి గురైన యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు. యలమంచిలి పట్టణం ద్వారకానగర్‌కు చెందిన రోమాల గంగాధర్(24) పట్టణానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. పదో తరగతి వరకు చదువుకున్న గంగాధర్ ఖాళీగా ఉంటున్నాడు. యువకుడి తీరు నచ్చక, యువతి ఏడాదిగా అతడ్ని దూరం పెట్టింది. ఈ నెల 27న యువతి పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు చెప్పేందుకు గంగాధర్ ఫోన్ చేశాడు. యువతి స్పందించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం రాత్రి ద్వారకానగర్‌లోని తన నివాసంలో కుటుంబ సభ్యులెవరూ లేని సమయంలో ఫ్యాన్ హుక్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ పాపినాయుడు మంగళవారం రాత్రి మీడియాకు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న పశువులు

పాయకరావుపేట: జాతీయ రహదారి మీదుగా పశువుల అక్రమ రవాణాకు పోలీసులు అడ్డుకట్ట వేశారు. వారి నుంచి 58 పశువులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బి.జోగారావు తెలిపారు. స్థానిక సీతారాంపురం గ్రామ సమీపాన గల హైవేపై 12 ఆవులు, 46 ఎద్దులతో రాజమండ్రి వైపు వెళ్తున్న వ్యాన్‌ను మంగళవారం పోలీసులు అడ్డుకున్నారు. పశువుల్ని స్వాధీనం చేసుకుని, వ్యాన్ యజమాని, డ్రైవర్లపై కేసు నమోదు చేశారు. పశువులను కొత్తవలస గోశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


గుర్తు తెలియని మృతదేహం

అనకాపల్లి: మండలంలోని తుమ్మపాల దరి ఏలేరు కాలువ మొదటి ఖానాలో సుమారు 35–40 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు పట్టణ పోలీస్‌లకు మంగళవారం సమాచారం అందింది. పట్టణ ఎస్ఐ వి.సత్యనారాయణ సంఘటనా స్థలికి చేరుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ఆ వ్యక్తి మరణించి రెండు రోజులపైనే కావొచ్చన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వివరాలు తెలిసినవారు 9490737758, 9491930675 నంబర్లను సంప్రదించాలని కోరారు.

2న క్రికెట్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: పోర్ట్ స్టేడియం వేదికగా జూన్ రెండో తేదీన ఒక్క రోజు క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు టోర్నీ ప్రతినిధి గంట్ల శ్రీనుబాబు తెలిపారు. వీజేఎఫ్ కార్యదర్శిగా సేవలందించిన ఎస్.దుర్గారావు స్మారక క్రికెట్ టోర్నీ పేరిట నిర్వహిస్తున్న ఈ పోటీల్లో నాలుగు జట్లు పాల్గొంటాయని వెల్లడించారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన పోటీల వివరాలు వెల్లడించారు. జర్నలిస్టుల జట్లు రెండింటితో పాటు కళాకారుల జట్టు, ప్రొఫెషనల్ వీడియోగ్రాఫర్ల జట్టు తలపడనున్నాయన్నారు. టోర్నీ ప్రతినిధి వాల్మీకి నాగరాజు మాట్లాడుతూ ఆదివారం నాలుగు జట్లతో నాకవుట్ పద్ధతిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు లోకేష్‌కుమార్, రాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మ ఆలయంలో చోరీ

- పట్టపగలే హుండీల్లో నగదు అపహరణ


నూకాంబిక అమ్మవారి ఆలయంలో చోరీ తీరును పరిశీలిస్తున్న పట్టణ పోలీసులు

యలమంచిలి రూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుకనున్న నూకాంబిక అమ్మవారి ఆలయంలో మంగళవారం పట్టపగలే చోరీ జరిగింది. మధ్యాహ్నం మూడు గంటలు దాటిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి ముందుగా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఆ తర్వాత ఆలయ ఆవరణలో ఉన్న రెండు హుండీల తాళాలను పగులగొట్టి వాటిలో ఉన్న నగదును దోచుకుపోయారు. విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ఆలయంలో సీసీ కెమెరాలున్నా చోరీ దృశ్యాలు రికార్డవలేదు. మధ్యాహ్నం 12 గంటల తర్వాత ఆలయం తలుపులు మూసివేసి అర్చకుడు, ఆలయ కమిటీ సభ్యులు ఇళ్లకు వెళ్లిపోయారు. తిరిగి సాయంత్రం 4 గంటల సమయంలో ఆలయానికి వచ్చేసరికి, హుండీలు పగులగొట్టి ఉండటాన్ని గుర్తించారు. అమ్మవారి విగ్రహానికి సుమారు 6 కిలోల వెండి ఆభరణాలు ఉన్నాయి. గర్భగుడి తలుపులు వేసినా, తాళం వేయలేదు. అదృష్టవశాత్తూ చోరీకి పాల్పడిన వారు ఆలయ గర్భగుడిలోకి ప్రవేశించకపోవడంతో ఆలయ కమిటీ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. చోరీ సమాచారం అందుకున్న పట్టణ ఎస్ఐ పాపినాయుడు, సిబ్బంది ఆలయానికి వెళ్లి చోరీ జరిగిన తీరును పరిశీలించారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకునితో మాట్లాడారు. హుండీల్లో ఎంత నగదు ఉండవచ్చని అడిగి తెలుసుకున్నారు. మంగళవారం రాత్రి క్లూస్ టీం సభ్యులు నిందితుల వేలి, పాద ముద్రలు, ఇతర ఆధారాలను సేకరించారు. నిత్యం రద్దీగా ఉండే ఆలయ ప్రాంతంలో చోరీ జరగడం పట్టణంలో చర్చనీయాంశమైంది.

బెస్ట్ వేల్యూ యూనివర్సిటీ ర్యాంకింగ్‌లో ఏయూకు స్థానం


వీసీ ప్రసాద రెడ్డి, రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్‌కు ఉత్తర్వులు అందిస్తున్న ఆచార్య ధనుంజయరావు

ఏయూక్యాంపస్ : బెస్ట్ వేల్యూ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ ఇన్ ఏసియాలో ఏయూకు మెరుగైన స్థానం లభించింది. ఆసియాలోని 20 దేశాల్లో 3,349 ఉన్నత విద్య అందించే విశ్వవిద్యాలయాలను అధ్యయనం చేసి ఈ స్థానాలను ప్రకటించారు. ఏయూ అత్యుత్తమమైన వర్సిటీల్లో టాప్ 300లో నిలిచింది. అకడమిక్ క్వాలిటీ, విద్య సంబంధిత అంశాలను పరిశీలించి ఈ ర్యాంకింగ్ అందించినట్లు నిర్వాహకులు ప్రకటించారు. దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులను అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌కు అందజేశారు.

పలు రైళ్ల రద్దు



తాటిచెట్లపాలెం: ప్రయాణికుల నుంచి సరైన స్పందన లేక, పలు భద్రతా పనుల నిమిత్తం కొన్ని రైళ్లు రద్దు చేస్తున్నట్లు మరికొన్ని రీ షెడ్యూల్ చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజన్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు సంబల్‌పూర్-కాచిగూడ-సంబల్‌పూర్(08325/08326) మధ్య నడుస్తున్న సమ్మర్ స్పెషల్‌కు ప్రయాణికుల నుంచి సరైన స్పందన లేనందున సంబల్‌పూర్-కాచిగూడ స్పెషల్ రైలు జూన్ 17, 24, కాచిగూడ-సంబల్‌పూర్ స్పెషల్ జూన్ 18, 25వ తేదీల్లో రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. లమ్‌డింగ్ డివిజన్ పరిధిలో జరుగుతున్న భద్రతా పనుల నిమిత్తం ఈ నెల 31వ తేదీన ఎస్ఎంవీ బెంగళూరులో బయల్దేరాల్సిన ఎస్ఎంవీ బెంగళూరు-అగర్తల(12503) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.

క్లుప్తంగా

నేడు 43 వేల ర్యాంక్ వరకు కౌన్సెలింగ్



పాలిసెట్ కౌన్సెలింగ్‌లో ఐసీఆర్ పత్రాలు పొందిన విద్యార్థులు

తుమ్మపాల: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల(రేబాక)లో పాలిసెట్-2024 కౌన్సిలింగ్ రెండవ రోజు కొనసాగింది. 12 వేలు నుంచి 27 వేల ర్యాంక్ కలిగిన విద్యార్థులు తమ ధ్రువపత్రాలను సమర్పించి ఐసీఆర్ పత్రాలు స్వీకరించారు. మొత్తం 157 మందిలో 94 మంది బాలికలు, 63 మంది బాలురు కౌన్సిలింగ్‌కు హాజరైనట్లు పాలిసెట్ కోఆర్డినేటర్, ప్రిన్సిపాల్ ఐవీఎస్ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం 27 వేలు నుంచి 43 వేలు ర్యాంకు వరకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు అందజేత



తుమ్మపాల ఆర్బీకేలో రైతుకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తున్న రంగాచారి

అనకాపల్లి: రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)ల్లో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయశాఖ అధికారి పీబీ రంగాచారి అన్నారు. మండలంలోని తుమ్మపాల ఆర్బీకే-2లో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను మంగళవారం అందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకుని పచ్చిరొట్ట విత్తనాలను పొందవచ్చన్నారు. జనుము, జీలుగ 10 కిలోల విత్తనాలు సబ్సిడీపై రూ.440లు, పిల్లిపెసర సబ్సిడీపై రూ.536లు చొప్పున రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మ ఏటీఎం పి.రామకృష్ణ పాల్గొన్నారు.

సెజ్ కాలనీలో కార్డన్ సెర్చ్

అచ్యుతాపురం: అచ్యుతాపురం సెజ్ కాలనీలో నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లో పలు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 79 ద్విచక్రవాహనాలు, రెండు ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సరైన రికార్డులతో వచ్చిన వారికి వాహనాలను అప్పగిస్తామని సీఐ బుచ్చిరాజు తెలిపారు.

అనకాపల్లి సినిమాలు

డర్టీ ఫెలో	: రాజా
ఫ్యూరియోసా	: సత్యనారాయణ స్క్రీన్-1
వ్యాన్	: సత్యనారాయణస్క్రీన్-2
బాక్	: షిర్డిసాయి
ఆ ఒక్కటీ అడక్కు	: షిర్డిసాయి
రాజుయాదవ్	: వెంకటేశ్వర
మంజుమ్మల్ బోయ్స్	: శ్రీసత్య
కృష్ణమ్మ	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 148 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	5,230	5,230
మొదటి రకం	4,870	4,250
రెండో రకం	3,080	4,200
మూడోరకం	3,030	4,140

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 56 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్లు, బీ పాజిటివ్-30 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-12 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు, ఏబీ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 428 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 369 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(0892 4223595)ని సంప్రదించవచ్చు.

వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యం



సమావేశంలో మాట్లాడుతున్న మలసాల భరత్‌కుమార్



హాజరైన పార్టీ మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

- 9న సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం
- అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యమని, విశాఖ కేంద్రంగా మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని ఆ పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు విల్లూరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం అనకాపల్లి మండల పరిధి నాయకులు, కార్యకర్తలు, అభిమానుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి 2 నుంచి పార్టీ శ్రేణులు వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం గ్రామ స్థాయి నుంచి శక్తి వంచన లేకుండా కృషిచేశారని తెలిపారు. జూన్ 4న వెలువడే ఫలితాల్లో వైఎస్సార్ సీపీ అత్యధిక మెజార్టీతో గెలవడం తథ్యమన్నారు. ఎన్నికల ఫలితాలు వెల్లడైన వెంటనే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జూన్ 4న రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో జరిపే విజయోత్సవ వేడుకలకు పార్టీ శ్రేణులు తరలి రావాల్సిందిగా పిలుపునిచ్చారు. పార్టీలో ఎవరూ వ్యక్తిగత విభేదాలకు పోకుండా సమష్టిగా గెలుపు కోసం కృషిచేసినందుకు ఆనందం వ్యక్తం చేశారు. తాను గెలిచిన వెంటనే నియోజకవర్గంలో సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటుచేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానన్నారు. ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ఏపీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి, అనకాపల్లి ఎమ్మెల్యేగా భరత్‌కుమార్ జూన్ 9న ప్రమాణస్వీకారం చేస్తున్నట్లు జోస్యం చెప్పారు. తన 36 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇంత గొప్ప ముఖ్యమంత్రిని చూడలేదన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్రంలో ఎక్కడా రూపాయి అవినీతికి ఆస్కారం లేకుండా అర్హులైన లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని అందించిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని గ్రూపులు కట్టినా, విజయం వైఎస్సార్‌సీపీదేనన్నారు. అంతకుముందు పార్టీ సీనియర్ నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహసత్యవతి, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ లక్ష్మి, జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పద్మ, జిల్లా నాయకురాలు ఎం.శోభ, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి భీశెట్టి జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

కశింకోట: మండలంలోని పలు గ్రామాల్లో ఎన్టీ రామారావు జయంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కశింకోట, చింతలపాలెం, సోమవరం, గొబ్బూరు తదితర గ్రామాల్లో ఎన్టీఆర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చింతలపాలెంలో సోమవరం మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పేదలకు, వృద్ధులకు దుప్పట్లు, తువ్వాళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఎస్ జెర్రిపోతుల నూకినాయుడు, పలువురు టీడీపీ నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

అనకాపల్లి: దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 101వ జయంతి వేడుకలు స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో టీడీపీ శ్రేణులు, ఎన్టీఆర్ అభిమానులు మంగళవారం చేపట్టారు. ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే పీలాగోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీష్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన రమణ

అనకాపల్లి: అనకాపల్లి జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోటవురట్ల మండలంలోని రాజుపేటకు చెందిన భార్యభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు. రాజుపేటకు చెందిన భీశెట్టి వెంకటరమణ భార్య, కుమారుడితో కలిసి విశాఖపట్నం వెళుతున్నారు. అనకాపల్లి మెయిన్‌రోడ్డు డైట్ కళాశాల వద్ద బైక్‌పై వెళుతున్న భార్యభర్తలను కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకటరమణకు, అతని భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. బాబు సురక్షితంగా బయటపడ్డాడు. క్షతగాత్రులను ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



పంపిణీకి సిద్ధంగా పచ్చిరొట్ట ఎరువులు

నబ్బువరం: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమయ్యే పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం రాయితీపై పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ తెలిపారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన జనుము 15 క్వింటాళ్లు, జీలుగ 8 క్వింటాళ్లు , పిల్లి పెసర 8 క్వింటాళ్లు విత్తనాలను సిద్ధంగా ఉంచామన్నారు.జనుము 10 కేజీల విత్తనాలు 50 శాతం రాయితీ పోను రూ. 440, పిల్లి పెసర విత్తనాలు 8 కేజీలు రాయితీ పోనూ రూ.536 రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పచ్చిరొట్ట ఎరువులను ఎకరాకు 12 నుంచి 16 కేజీలు భూమిలో వేసుకొని 40 నుంచి 45 రోజుల తర్వాత అంటే పూత దశ లో భూమిలో కలియ దున్నడం ద్వారా సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుందని చెప్పారు.దీనివల్ల రసాయనక ఎరువుల వినియోగం తగ్గడమే కాకుండా నాణ్యమైన ఉత్పత్తులను పండించవచ్చన్నారు. అదే విధంగా రైతులకు అవసరమైన వరి విత్తనాలు కొరకు రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని ఏవో తెలిపారు.

ఘనంగా పైడితల్లమ్మ జాతర



అమ్మవారి జాతర సందర్భంగా ఊయల సంబరం



పూజలందుకున్న పైడితల్లి అమ్మవారు

ఎస్.రాయవరం: కొరుప్రోలు గ్రామంలో శ్రీ పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు.వేకువ జామునుంచి భక్తులు అమ్మవార్ని దర్శించుకునేందుకు పోటీపడ్డారు. గ్రామ శివారు తోటలో కొలువుతీరిన అమ్మవారికి మహిళలు పసుపుకుంకుమలు సమర్పించగా , అన్నదాతలు రైతులు మొక్కులు చెల్లించుకుని , పొలాల్లో పండిన ఫల సాయాలను నైవేద్యంగా సమర్పించారు. గ్రామంలో అన్న సమారాధన నిర్వహించారు. జాతరను పురస్కరించుకుని గ్రామంలో 9 రోజులు అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి వైభవంగా ఊయల సంబరం నిర్వహించారు. దీంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.


మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంఈవో వేణుగోపాలరావు

మునగపాక: మధ్యాహ్న భోజన పథకాన్ని, రుచికరంగా సమర్థంగా నిర్వహించాలని ఎంఈవో వేణుగోపాలరావు కోరారు. మంగళవారం మండలంలోని నాగులాపల్లి జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం కార్మికులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలల ప్రారంభం నుంచి పథకం నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలన్నారు.

వైభవంగా పరదేశమ్మ అనుపు మహోత్సవం



పరదేశమ్మ

నబ్బువరం: మండలంలోని రాయపుర అగ్రహారంలో కొలువైన పరదేశమ్మ అమ్మవారి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పసుపు కుంకుమలు,చీరలు అమ్మవారికి సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ,మజ్జిగ పంపిణీ చేశారు.అమ్మవారి సన్నిధిలో రాత్రికి నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకొన్నాయి.రాత్రికి అమ్మవారి అనుపు మహోత్సవం వైభవంగా నిర్వహించారు.

8 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు



కంటి ఆపరేషన్ చేయించుకున్న రోగులతో రవిరామ్ జవహర్

అనకాపల్లి: స్థానిక గవరపాలెం ఏఎంఏవీఎం రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం 8 మందికి ఉచితంగా కంటి అపరేషన్లు చేయించినట్లు రోటరీ ప్రతినిధి రవిరామ్ జవహర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఆస్పత్రి ఆవరణలో 28 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో 8 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశామన్నారు. అన్ని పరీక్షలు జరిపి, ఐవోఎల్ కంటి ఆపరేషన్‌ను డాక్టర్ కె.మల్లేశ్వరరావు నేతృత్వంలో చేసినట్లు వెల్లడించారు. ఆపరేషన్ అనంతరం 5 రోజులకు సరిపడా మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో నేత్ర వైద్యసహాయకురాలు పి.దేవి, రోగుల సహాయకులు పాల్గొన్నారు.

చురుగ్గా విభిన్న ప్రతిభావంతుల గుర్తింపు



విభిన్న ప్రతిభావంతుడితో ఎంఈవోలు లక్ష్మణరావు, మూర్తి తదితరులు

నబ్బువరం: విభిన్న ప్రతిభావంతులు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి ఎస్. లక్ష్మణరావు అన్నారు. మండలంలో విభిన్న ప్రతిభావంతుల గుర్తించేందుకు ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 1న ప్రారంభించిన సర్వే వచ్చేనెల 9వ తేదీ వరకూ నిర్వహించామని చెప్పారు. నబ్బువరంలోని గోపాల్‌నగర్ పరిసర ప్రాంతంలో వినికిడి లోపం గల విద్యార్థిని గుర్తించామన్నారు.ఈ విభిన్న ప్రతిభావంతులకు రవాణా భత్యం తదితర సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. సర్వేలో ఇప్పటి వరకూ 14 మందిని గుర్తించామన్నారు. వారిని సమీపంలో ఉన్న పాఠశాలలో నమోదు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 బీఎస్ఎన్ మూర్తి, బి. సింహాద్రప్పడు,ఎస్. బేబీ రాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రవణ నక్షత్ర హోమం

సింహాచలం: శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం కొండదిగువ ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 8.30గంటల నుంచి విశేష హోమం నిర్వహించనున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్. శ్రీనివాసమూర్తి తెలిపారు. భక్తులంతా కార్యక్రమాల్లో పాల్గొని తరించాలని కోరారు.

విధుల్లో హాజరు నమోదు తప్పనిసరి



మాట్లాడుతున్న ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు

కోటవురట్ల : సచివాలయ ఉద్యోగులు విధులకు హాజరైనపుడు, వెళ్లేటపుడు హాజరు నమోదు తప్పనిసరిగా చేయాలని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించాలన్నారు. సచివాలయాలలో ఈ-సేవలను మెరుగుపరచాలన్నారు. లబ్ధిదారులతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు.

త్రిపురాంతకస్వామికి పుష్పాంజలి



త్రిపురాంతకస్వామి, సర్వమంగళాంబలకు నివేదించిన స్వీట్లు, పండ్లు, సుగంధ ద్రవ్యాలు



త్రిపురాంతకస్వామి, సర్వమంగళాంబల ఉత్సవ విగ్రహాలకు పూలతో అలంకరణ

కశింకోట: స్థానిక పురాతన శివాలయంలో కొలువైన సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామికి మంగళవారం రాత్రి కన్నుల పండువగా పుష్పాంజలి నిర్వహించారు. ఈ నెల 23న స్వామి కల్యాణోత్సవాన్ని భారీగా జరిపిన విషయం తెలిసిందే. ఉత్సవాల ముగింపు రోజున నిర్వహించే పుష్పాంజలి సందర్భంగా స్వామివార్ల కల్యాణోత్సవ విగ్రహాలను నూతన వస్త్రాలు, మల్లెపూల మాలలతో అందంగా అలంకరించారు. పలు రకాల తీపి పదార్థాలు, పండ్లు, ఇతర పదార్థాలు, పాలు, సుగంధ ద్రవ్యాలు నివేదించి, పూజలు చేశారు. ఊయలలో కల్యాణమూర్తులను నిలిపి లాలించారు. భక్తులు భక్తి పారవశ్యంతో పాటలు పాడారు. మంగళవారం ఉదయాన్నే స్వామి మూలవిరాట్‌ను, అమ్మవారిని అందంగా అలంకరించి తొలుత పూజలు జరిపారు. ప్రసాద వితరణ చేశారు. స్థానిక విశ్రాంత డ్రాయింగ్ ఉపాధ్యాయుడు భీమిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భక్తులకు కూల్ డ్రింక్‌లు పంపిణీ చేశారు. ఆలయ అర్చకులు వి.బాబ్జి, వి.కృష్ణల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



ప్రపంచ రుతు పరిశుభ్రత దినోత్సవ సభలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో ప్రభావతి



హాజరైన స్వయం సహాయక సంఘాలు సభ్యులు, స్థానిక యువతులు

కశింకోట: మహిళలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ సీడీపీవో పి.ప్రభావతి సూచించారు. కశింకోటలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం ప్రపంచ రుతు పరిశుభ్రత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల మహిళలు, కిశోర బాలికలకు రుతు పరిశుభ్రత ప్రాధాన్యం , రుతుస్రావ సమయంలో అనుసరించాల్సిన జాగ్రత్తలను వివరించారు. రుతుస్రావ సమయంలో మహిళలు ఆరోగ్యం పట్ల మరింత శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా యుక్త వయస్సు బాలికలు, స్వయం సహాయక సంఘాల మహిళలు ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన వీడియోను ప్రదర్శించారు. శానిటరీ నేప్‌కిన్స్ వాడకంపై అవగాహన కలిగించారు. అనంతరం రుతు పరిశుభ్రత దినోత్సవ ప్రాధాన్యతపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి, అసిస్టెంట్ సీడీపీవో శశికళ, సూపర్‌వైజర్లు సుచరిత, వంశీప్రియ, ఎంఎల్‌హెచ్‌పీ నవ్యదుర్గ, ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు, సీసీలు అనూరాధ, నిర్మల, సత్యనారాయణ, రామకృష్ణ, శ్రీను, వీవోఏలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు



కశింకోటలో జన సంచారం లేక బోసిపోయిన పంచాయతీ ప్రధాన రహదారి

కశింకోట: స్థానిక ప్రజలు మంగళవారం సూర్యతాపానికి అల్లాడిపోయారు. ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరిగాయి. గత కొద్ది రోజులుగా తుపాను కారణంగా ఆకాశం మబ్బులు వేసి ఎండ తీవ్రత కాస్త తగ్గింది. రోహిణి కార్తె ప్రవేశంతో మళ్లీ ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఒక్కపక్క ఉష్ణోగ్రత, మరో పక్క ఉక్కబోతతో ప్రజలు అల్లాడిపోయారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వేడి ఉష్ణోగ్రత కొనసాగింది. దీంతో అత్యవసర పనులున్న వారు తప్ప, మిగిలిన వారెవరూ ఇళ్ల నుంచి బయటకు రావడానికి సాహసించలేదు. దీంతో ఇక్కడి ప్రధాన రహదారితోపాటు, వీధులు జన సంచారం లేక వెలవెలబోయాయి. సాయంత్రానికి వాతావరణం కాస్త చల్లబడింది. ప్రజలు తమ కార్యకలాపాల్లో బిజీ అయ్యారు. బుధవారం మరింతగా ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నట్లు వాతావరణ విభాగం అధికారులు చెప్తున్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

డీఎస్పీ సత్యనారాయణ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ సత్యనారాయణ

పరవాడ: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సమయంలో అంతా సహనంతో ఉండాలని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ సూచించారు. గ్రామాల్లో ఎలాంటి గొడవలకు దిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తాడి గ్రామంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో డీఎస్పీ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఇరు వర్గాలు ఎటువంటి తగాదాలు పడవద్దన్నారు. అంతా సోదర భావంతో మెలగాలని సూచించారు. పోటీల్లో ఎవరో ఒకరు గెలవడం సహజం అన్న విషయాన్ని గ్రహించి అంతా సోదరుల్లా మెలగాలన్నారు. సదస్సులో పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యం కోసం చదువుకుంటే ఉజ్వల భవిష్యత్



శివకుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక : విద్యార్థులు లక్ష్యం కోసం చదువుకోవాలని తద్వారా ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని ప్రవాస భారతీయుడు భీమిశెట్టి శివకుమార్ పేర్కొన్నారు. మంగళవరపుపేటలో మా ఊళ్లో గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చదవడం అంటే మా కిష్టం కార్యక్రమాన్ని ఆయన మంగళవారం తిలకించారు. గ్రంథాలయ అభివృద్ధికి తన వంతుగా రూ.10 వేల నగదును సాయంగా అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ గ్రంథాలయాల ద్వారా విలువైన విజ్ఞానం దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయం వ్యవస్థాపకుడు ఏవీఎస్ మూర్తి, గ్రంథాలయ కార్యదర్శి యల్లపు సంజీవరావు, విశ్రాంత ఉపాధ్యాయులు ప్రసాదరావు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మా ఊళ్లో గ్రంథాలయం అభివృద్ధికి సాయం అందజేసిన శివకుమార్‌ను సత్కరించారు.